చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

తుది విజయం

ఖడ్గం అంచు పైన తెల్ల పావురం
నెత్తురు బురదలో మొలుస్తున్న కలువలు
తాండవం దారిలోనే నెమలి ఆట
జీవన బృందావనంలో శాంతి మురళి గానం
పడగ విప్పిన సర్పం తల ఊపుతుంది
పులి మేకతో కలిసి సయ్యాటలాడుతోంది
ఒక అభయంకర జీవితం...

పూలు పూలుగా కురుస్తున్న అక్షరం
ఎనలేని పరిమళం
ఎక్కడిది ఇదంతా
ఏ పోహళింపు పరిణామం ఇదంతా
యుద్ధం అంటే నెత్తురేనని
భయం బొరియలో ఊపిరి కూడా
సరిగా తీయలేని విషాద అస్తిత్వమేనని
వెనకైనా ముందైనా
కిందైనా మీదైనా
చరమ సంధ్య ఓటమేనని
ఎప్పుడు తెలుస్తుంది?
యుద్ధానికి నువ్వు చెప్పే
అబద్ధం నిజమే అనుకున్నా
దాని పర్యవసానం శాంతేనని
గుట్టు నీ గుండెలో
ఎప్పుడు విప్పారుతుంది
జీవితం అసత్యం కాదు
భ్రమ అసలే కాదు
దీన్ని రక్తంతో అనుభవించడం...

క్షమాశాంతి క్రాంతికి
మూలధాతువులు
యాత్రికుడా
ఇంకా ఎడారి
యానం చేయకు
చమరింతల కనుల
లోలోపలి చెలిమను
ఎండనీయకు
జీవితాన్ని మరొక
తూర్పు ముఖం చెయ్
శాంతి-యుద్ధం
బొమ్మ బురుసులే
చివరి విజేత నిశ్చయంగా శాంతే

కాంచనపల్లి గోవర్ధన్ రాజు
9676096614

తెలుగులో అచ్చులు మూడే

‘దేశ భాషలందు తెలుగు లెస్స’ అన్న తెలుగు వ్యాకరణ పండితులు కొందరు ‘తెలుగుకు ఉన్న వ్యాకరణ దీపం చిన్నది’ అన్నారు. సంస్కృత భాషా వ్యాకరణ కౌముది వంటి గ్రంథాలను దృష్టిలో పెట్టుకొని తెలుగు వ్యాకరణ పండితులు ఈ మాట అని ఉంటారని చెప్పవచ్చు.

తెలుగు వ్యాకరణ గ్రంథాలు అనగానే చాలా మంది తెలుగు పండితులకు చిన్నయసూరి రాసిన ‘బాల వ్యాకరణం’, బహుజనపల్లి సీతారామశాస్త్రి రాసిన ‘ప్రౌఢ వ్యాకరణం’ వంటి గ్రంథాలు మొదటగా గుర్తుకువస్తాయి. ఆపై నన్నయ్య విరచితమని చెప్పబడుతున్న ఆంధ్ర శబ్ద చింతామణి, మల్లియరేచన కవి జనాశ్రయం, అథర్వణుని అథర్వణ కారికావళి, కేతన ఆంధ్ర భాషా భూషణము, విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణి, అనంతామాత్యుని ఛందో దర్పణం, వెల్లంకి తాతంభట్టు కవి చింతామణి, ముద్దరాజు రామన్న కవి జన సంజీవని, బాలసరస్వతి బాల సరస్వతీయం, అప్పకవి అప్పకవీయం, గణపవరపు వెంకటకవి ఆంధ్రకౌముది, అహోబలపండితుని అహోబల పండితీయం కూచిమంచి తిమ్మకవి లక్షణసార సంగ్రహం, అడిదం సూరకవి కవిసంశయ విచ్ఛేదం, శిష్ట్లా కృష్ణమూర్తి శాస్త్రి హరికారికావళి వంటి తెలుగు వ్యాకరణ గ్రంథాలు యాదికివస్తాయి.

> తెలుగు వ్యాకరణ గ్రంథాలు పూర్వ కవుల పద ప్రయోగాల వ్యాకరణ కార్యాల గురించి చెప్పినంతగా వ్యావహారిక భాషా ప్రయోగాల వ్యాకరణాంశాల గురించి చెప్పలేదు. మాండలిక భాషలోని యాసనందలి ఉదాత్తానుదాత్త గణిత ధర్మాల గురించి అసలు చెప్పలేదు.

తెలుగు ప్రబంధాదులందే గాక తెలుగు వ్యాకరణ గ్రంథాలలో సైతం అనువాద శాతమే అధికంగా కనపడుతుంది. చిన్నయసూరి బాల వ్యాకరణం హరికారికావళి వ్యాకరణ గ్రంథానికి మక్కికి మక్కీ అని కొందరంటారు. నన్నయ విరచితమని చెప్పబడుతున్న ఆంధ్ర శబ్ద చింతామణి ఆయన రచన కాదని చెప్పేవారే అధిక శాతం ఉన్నారు. చిన్నయ సూరి రాసిన బాల వ్యాకరణానికి అనుబంధంగా రాసిన ప్రౌఢ వ్యాకరణాన్ని త్రిలింగ లక్షణ శేషం అని కూడా అంటారు. ఇలా తెలుగు వ్యాకరణ గ్రంథాలు అనువాద మార్గానికే అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టుగా కనపడుతుంది. సంస్కృత వ్యాకరణాన్ని తెలుగుకు అనువాదం చేసేటప్పుడు మన తెలుగు వ్యాకరణ పండితులు వ్యాకరణ పారిభాషిక పదజాలానికి అనేక అశాస్త్రీయ అర్థాలను కల్పించారు.



మనిషి నోరు, నాసికల నుంచి జనించే అక్షర ఉత్పత్తి ఆధారంగా సశాస్త్రీయంగా సంస్కృతంలో సంధులు మొదలైన వ్యాకరణాంశాలను చెప్తుంది. దాన్ని బట్టి ఆదేశం, ఏకాదేశం, ఆగమం వంటి వ్యాకరణ పారిభాషిక పదాలకు సశాస్త్రీయంగా అర్థాలను చెప్తుంది. వేదాంగాలైన శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పములలో వ్యాకరణ మూలాలు బాగా తెలియాలంటే, శిక్ష, నిరుక్తములు కూడా కొంత తెలియవలసిన అవసరం ఉన్నది. లేకుంటే ఆదేశానికి, ఏకాదేశానికి తేడా తెలియకుండా పోతుంది. చిన్నయసూరి తన బాల వ్యాకరణంలో ‘ఆర్య వ్యవహార దుష్టంబు గ్రాహ్యంబు’ అని అంటారు. నిజానికి తెలుగు వ్యాకరణ మూలాలు అటు సంస్కృత వ్యాకరణ మూలాల్లోకి, ఇటు వ్యావహారిక తెలుగు భాషా మూలాల్లోకి వెళ్లకపోవడం వల్ల, సశాస్త్రీయ మార్గాన్ని అనుసరించక పోవడం వల్ల అలా చెప్పవలసిన అవసరం ఏర్పడింది.

నేడు ఇంగ్లీష్ భాషలో 26 అక్షరాలుంటే అందులో ‘ఏ, ఈ, ఐ, ఓ, యూ’ అనే అక్షరాలను అచ్చులని అంటారు. తెలుగు వ్యాకరణం ప్రకారం తెలుగు భాషకు అచ్చులు 16. అందులో ‘అలు, అలూ’ అనే రెండక్షరాలు వాడుకలో లేవు. వాటిని తీసివేస్తే తెలుగు భాషకు అచ్చులు 14 అవుతాయి. ఆధునిక కాలంలో ‘ఋషి’ అని రాయడానికి ‘రుషి’ అని హల్లును ఉపయోగించి రాసేస్తున్నారు. అలా ఋ, ఋలను తీసివేస్తే తెలుగులో 12 అచ్చులే ఉంటాయి. శిక్ష, వ్యాకరణ ధర్మాలను అనుసరించి అ+ఇ=ఏ, అ+ఉ=ఓ, ఆ+ఏ=ఐ, అ+ఓ=ఓ ఇలా ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔలను మినహాయిస్తే తెలుగులో అచ్చులు 6 మాత్రమే మిగులుతాయి. ఇందులో దీర్ఘాచ్చులను తీసివేస్తే తెలుగుభాషకు మూడంటే మూడు అచ్చులుంటాయి. మన తెలుగు వ్యాకరణ పండితులు కొంత సంస్కృత వ్యాకరణ సంప్రదాయాలను, కొంత తెలుగు వ్యాకరణ సంప్రదాయాలను అనుసరించడంతో తెలుగు భాషకు అచ్చులు 16 అయ్యాయి. వాటికి లిపి పుట్టుకువచ్చింది. తెలుగు అజంత భాష అయ్యింది. అవసరాన్ని బట్టి పరభాషా వ్యాకరణ సంప్రదాయాలను స్వీకరించడం తప్పు కాదు. కానీ, పరభాషా వ్యాకరణ సంప్రదాయాల మూలాలను గ్రహించకుండా వాటిని స్వీకరిస్తే భాషకు మేలు కంటే కీడే ఎక్కువ.

> నేడు తెలుగు భాషలో ఇంగ్లిష్ పదాల జోరు పెరిగింది. ఇంగ్లిష్ భాషా పదాలు అధికశాతం హలంతాలుగా ఉంటాయి. దానితో పద ప్రయోగంలో వేగం పెరుగుతుంది. ఈ వాస్తవాలను గమనించి తెలుగు వ్యాకరణాన్ని రూపొందించుకోవాలి.

కానీ, మనవారు ఆర్య వ్యవహార దుష్టంబు గ్రాహ్యంబు అంటూ పాత పద్ధతుల్లోనే వెళ్తున్నారు. తెలుగు వ్యాకరణ పండితులు సంస్కృత వ్యాకరణ మూలాలను కూడా గ్రహించి ఉంటే.. అచ్చుల సమితి, హల్లుల సమితి, వక్రముల సమితి, వక్రతమాల సమితి, కపటయాది సూత్రాలు, సంయుక్త వర్ణ సమితి, విచ్ఛేద వర్ణ సమితి, ప్రత్యాహార అక్షర సమితి అనే అంశాలు తెలుగు వ్యాకరణంలో ఉండేవి. పాణిని వంటి మహర్షులు సంస్కృత వ్యాకరణాన్ని గణిత ఛాయాబద్ధంగానే చెప్పారు. తెలుగు వ్యాకరణ పండితులు మాత్రం సంస్కృత వ్యాకరణంలోని గణిత ఛాయలకు తిలోదకాలిచ్చారు.

సంస్కృత వ్యాకరణ గ్రంథం కౌముదిలోని మహేశ్వర సూత్రాలలో మొదటి సూత్రం ‘అ ఇ ఉ ణ్’ వీటిని వ్యాకరణ పారిభాషిక పదం ప్రకారం అణ్ణులు అని అంటారు. నిజం చెప్పాలంటే ఈ అణ్ణులు మూడే తెలుగు భాషలో ప్రధాన అచ్చులు అని చెప్పవచ్చు. కంప్యూటర్‌లోని ఫైల్ సిస్టం ఈ అణ్ణులు అనే పద ప్రయోగంలో ఉన్నది. ఇలా నేడు ఎంతమంది సంస్కృతాంధ్ర వ్యాకరణాలను బోధిస్తున్నారు? సంస్కృతం సంగతి అలా ఉంచి తెలుగు భాషాభిమానులు జర ఆలోచించండి. విదేశీ శాస్త్రవేత్తలు ఏదన్న కొత్త విషయాన్ని కనిపెడితే చాలు.. మనవారు ఇదంతా మా వేద పురాణేతిహాసాలలో పూర్వమే ఉన్నదంటారు. ఉంటే వారికంటే ముందే మనవారు ఎందుకు చెప్పరు? మనవారి పాండిత్యం ఎదుటివారిని విమర్శించడానికి తప్ప నవీన విజ్ఞాన రూపకల్పనకు పనికిరాదా? నిజం చెప్పాలంటే పాణిని విరచిత కౌముదిలోని మహేశ్వర సూత్రాలను సశాస్త్రీయంగా పాణిని మహర్షి ఆలోచించిన విధంగా వివరిస్తే చాలు. అక్కడే అచ్చులు, హల్లులు, అణ్ణులు వంటి వ్యాకరణ పారిభాషిక పదాలు ఎలా పుట్టాయో తెలియడమే గాక కంప్యూటర్‌లోని ఫైల్ సిస్టం, ద్విసంఖ్యా మానాది గణితం వంటి అంశాలూ ఎరుకకు వస్తాయి. పరీక్షల కోసం తెలుగు, తెలుగు వ్యాకరణం, మార్కుల కోసం సంస్కృతం ఉన్న ఈ రోజుల్లో ఇదంతా జరుగుతుందా? అంటే సమాధానం శూన్యం. ■

వాగుమూడి లక్ష్మీరాఘవరావు
6281490160

మిగిలింది ఏముంది

దుక్కిని దున్నిన
నా జీవితానికి దుఃఖమే మిగిలింది
అన్నం పెట్టిన నా చేతులు
అరచేతి గీతలు అరుగుతున్నాయి

పొలం దున్ని పోగేసుకున్న
అప్పు తప్ప ఆత్మతేం మిగిలింది
పస్తులుండి పంటను తీసి
ప్రపంచానికి బువ్వ పెట్టి బూడిదవుతున్న
మిత్తి ఒత్తిడే మిగిలింది ఏముంది?

కోతలు కోసిన నా చేతికి
కొడవలి కోతలే మిగిలే
గింజలు తీసిన నా మనసుకు
గిట్టని ధరలే మిగిలే

ఎగుమతి
ఎద మీద ఏసింది భారం
కష్టానికి మిగిలే కారిన స్వేదం
కారిన చెమట ఖరీదు లేదు
ఎవుసమంటే రైతు ఏడుపేనా?

దేవరపాగ కృష్ణయ్య
99634 49579

బుగ్వేద విద్యాసంపన్నులు, కవిపండిత ప్రవరులు, రాజకీయవేత్త, దుందుభి కావ్యకర్త గంగాపురం హనుమచ్ఛర్మ శతజయంతి వత్సరమిది. క్రీ.శ.1925 సెప్టెంబర్ 29వ తేదీన పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి మండలం వేపూరులో ఆయన జన్మించారు. కల్వకుర్తి మండలం గుండూరులో స్థిరనివాసం ఏర్పర్చుకొని రెండుసార్లు గుండూరు, లింగసానిపల్లి గ్రామపంచాయతీకి ఏకగ్రీవ సర్పంచ్‌గా, గుండూరు ప్రత్యేక గ్రామ పంచాయతీకి ఒకసారి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. స్వాతంత్రోద్యమం, గ్రంథాలయోద్యమం, భూదానోద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు.

సాహిత్య, ప్రజా సేవలో తరించిన హనుమచ్ఛర్మ

సెప్టెంబర్ 29న జయంతి సందర్భంగా..

హనుమచ్ఛర్మ మార్చాల, పాలుమూరుల్లో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. చినమరూరులో వేంకటనరసింహ శాస్త్రి వద్ద సంస్కృతం, రఘువంశాదులు నేర్చుకున్నారు. కరివెనలో పరుశురామశాస్త్రి వద్ద కావ్య నాటకాలు, మంకాల కృష్ణశాస్త్రి వద్ద పాణినీయ వ్యాకరణం నేర్చుకున్నారు. ఋగ్వేదం గురుముఖతః నేర్చుకున్నారు. 60-70 సంవత్సరాలకు పూర్వమే హరిజన ఇండ్లల్లో పెండ్లిళ్లు, సత్యనారాయణ వ్రతాలను చేయించి అస్పృశ్యతా నివారణను అక్షరాలా ఆచరించిన ఆదర్శప్రాయుడు హనుమచ్ఛర్మ.

గుండూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాలను, మాధ్యమిక పాఠశాలగా, తరువాత ఉన్నత పాఠశాలగా తీర్చిదిద్ది వాటి భవనాల నిర్మాణానికి అహర్నిశలు పాటు పడ్డారు. గ్రామంలోని మాదాయ చెరువును నీటితో నింపటానికి చిన్నవాగు (ధీమతి)పై ఆనకట్టను నిర్మించి కాలువ ద్వారా నీటిని తెప్పించడంలో ఆయన కృషి మరువలేనిది. హనుమచ్ఛర్మ దుందుభి (డిండి) నదిపై అదే పేరుతో రాసిన కావ్యం సుప్రసిద్ధం. ఈ ప్రాంత చరిత్ర, రాజులు, కవి పండితులు, కళాకారుల చరిత్రలను ఆయన అందులో లిఖించారు. ఇది ముద్రణకు పూర్వమే బహుళ ప్రజాదరణ పొందినది. 1961లో ప్రథమ ముద్రణ పొందింది. 1990లో ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో ప్రీ డిగ్రీ కోర్సుకు ఎంపికైనప్పుడు రెండోసారి ముద్రితమైంది. తృతీయ ముద్రణను విజ్ఞాన సరోవర ప్రచురణలో భాగంగా కొండా లక్ష్మీకాంత్ రెడ్డి ముద్రించారు. గత కొంతకాలంగా ఈ కావ్యం తెలంగాణలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పాఠ్యాంశంగా ఉంది. 2017లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో శర్మ మోనోగ్రాఫ్‌ను ప్రచురించారు.

1997లో వీరి స్మారకంగా మాజీ మంత్రి, ఎంపీ పి.రాములు అధ్యక్షతన గుండూరు గ్రామప్రజలు ‘గంగాపురం హనుమచ్ఛర్మ స్మారక సమితి’గా ఏర్పడి ఆయనపై స్మారక సంచికను ముద్రించారు. ఇందులో ముద్రిత కావ్యం దుందుభితో పాటు ఆయన ఖండికలు, బహుముఖ ప్రజ్ఞావిశేషాలు, సమాజ సేవ, మిత్రుల వ్యాసాలు, కల్వకుర్తి ప్రాంత చరిత్ర మొదలైనవి వేశారు. మహబూబునగర్ జిల్లాలో ఒక కవిపై వచ్చిన మొట్టమొదటి స్మారక సంచిక ఇదే.

ఋగ్వేద విజ్ఞానం గ్రంథాన్ని శర్మ తన చిన్నాన్న గంగాపురం నృసింహ దీక్షితులతో కలిసి 1967లో రచించారు. దీన్ని సురవరం ప్రతాపరెడ్డి స్థాపించిన విజ్ఞానవర్ధనీ ప్రచురణల సంస్థ ముద్రించింది. హనుమచ్ఛర్మ కేవలం సాహిత్య రంగానికే పరిమితమై ఉండి ఉంటే మరికొన్ని రసవద్రచనలను అందించగలిగేవారు. చిన్ననాటి నుంచి ఉద్యమాలు, ప్రజాసేవ పట్ల ఉన్న ఆసక్తి కారణంగా సాహిత్యంపై ఎక్కువ దృష్టి నిలపలేక పోయారు. శర్మ ఏర్పాటుచేసిన పాఠశాలలో చదివిన ఎందరో నేడు ఉన్నత పదవుల్లో ఉన్నారు. ఆయన ప్రభావంతో ఎందరో స్వచ్ఛంద కార్యకర్తలు తయారై గ్రామ స్వరాజ్యసిద్ధికి కృషిచేశారు.

కల్వకుర్తిలో బాపూజీ గాంధీ హాస్టల్ సురభి శర్మ, మంద లింగారెడ్డి, నామముత్యాలుతో కలిసి నిర్వహించారు. ఆ రోజుల్లో ఇప్పటి లాగా ప్రభుత్వం హాస్టళ్లను నిర్వహించేది కాదు. ప్రభుత్వం నుంచి ఎప్పుడో కొంత గ్రాంట్ అందేది. అది సరిపోయేది కాదు. దాని కోసం విరాళాలు సేకరించి హాస్టల్ నడిపేవారు. దానితో పాటు అదే హాస్టల్‌లో ఆయన స్వచ్ఛంద ఉపాధ్యాయునిగా కూడా పనిచేశారు. శర్మ దుందుభి కావ్యకర్తగానే గాక ఈ విధంగా సార్వజనీన కార్యక్రమాల ద్వారా సుప్రసిద్ధులయ్యారు. ఆయనలో ఉన్న జాతీయ భావన, స్వతంత్రతా జీవన సరళి చివరి వరకు చెక్కుచెదరలేదు. 1996 ఆగష్టు 15న పరమపదించారు.

శివరాం శర్మ
89772 43484

వ్యాసకర్త: కార్యదర్శి, గంగాపురం హనుమచ్ఛర్మ స్మారక సమితి

బుల్డోజర్ మీద ఒక కల నీటిచుక్క

విధ్వంసం తర్వాత గల్లీలోని మనుషులు
ఎక్కడికి నడిచిపోయారో ఆ అడుగులు కనపడవు
మట్టిపెళ్లల మధ్య కొద్దిసేపు ఏడ్చి
భుజం మీద బిడ్డ
నెత్తి మీద జీవితాన్ని నడిపించే
పొయ్యిని పెట్టుకొని కదిలిపోతుంటే
ఇంటి పడుచు కమిలిన ముఖంతో
సొట్టలు పడ్డ బిందెను రొండి మీద పెట్టుకొని
భర్త వెంట కూలిన ఇంటి
ఆనవాళ్ల నీడలను దాటిపోతుంది

ఇంటి కల బుసలుకొట్టే అప్పుతో తీరినట్టే
అనుకున్నా ఈఎంఐ వెంటాడేది అప్పుడు
ఇప్పుడు కన్నీళ్లను ఖాతాలో జమ చేయగలమా
జ్ఞాపకాలను మనసులో దాచుకొని పోవచ్చు కానీ
ఆ కాసింత జాగని చాపలా చుట్టేసుకోలేము

అమ్మినవాళ్లు చెరువు నీళ్లలో చేపలాగా
ఎక్కడో జారుకుంటారు
కొన్నవాళ్లు రోడ్డు మీద ముక్కలైన
కలల దేహాలతో నిలబడతారు
జలాశయాలన్నీ జనాశ్రయాలు కాదు నిజమే
నేరం పొట్లెయినర్ పండ్లల్లో బంబీ అవుతుంటే
హోదాలు పెంచుకున్న పెద్ద మనుషుల భవంతులు
నీటి అలల మీద పడవల్లా తేలిపోతుంటాయి
అక్కడిదాకా చేతులు సాగవు

వాళ్లు మీ నీడలను వెతుక్కుంటూ తప్పక వస్తారు
మరో కలని భరోసా ఇవ్వడానికి కాదు
ఆ రెండు ఓట్లు అడగడానికి

వేముగంటి మురళి
93922 56475

> ఒకల భాష ఒకరు నేర్చుకున్నారే కానీ, ఎదుటివారి భాషను అవమానపరచటం వంటి అనాగరిక చేష్టలు ఎవరూ చేయలేదు. అందుకే, తెలంగాణ వైవిధ్యాల ప్రపంచం అయింది మొదటినుంచీ. పరభాషల మీద ఇటువంటి గౌరవం చూపించబట్టే 15 భాషలు అనర్గళంగా మాట్లాడగలిగిన ఒక పీవీ నరసింహారావు, 5 భాషల్లో పాండిత్యం ఉన్న ఒక సదాశివ తెలంగాణలో మాత్రమే వెలిశారు. కానీ, ఆంధ్రవారు తెలంగాణ ప్రాంతానికి వచ్చినప్పటి నుంచీ వైవిధ్యాన్ని వైరుధ్యంగా మార్చారు. దానికీ ఒక బలమైన కారణం ఉంది. ఆంధ్ర ప్రాంతం భారతదేశం మొత్తాన్ని పరిపాలించిన ఇంగ్లిషువారి కింద నాలుగు వందల ఏండ్ల బానిసత్వాన్ని అనుభవించింది. పైగా వారికి రెండే భాషలు తెలుసు.

పాలకుల భాష, పాలితుల భాష

భాషా సమైక్యతే భావ సమైక్యత!-2

పాలకుల భాష, పాలితుల భాష. అంటే అధికార భాష, బానిసత్వ భాష. అందుకే వారికి రెండు వైవిధ్యాల మధ్య సమానత్వం ఉండాలన్న భావన ఉండదు. పై అధికారికి చెప్పులు కడుగుతారు, కిందవారిని కాళ్ల కింద అణచివేస్తారు. అటువంటి సంస్కృతి తెలంగాణలో లేదు. కాబట్టే, ఈ ప్రాంతంలో అన్ని భాషలు, సంస్కృతులు ఆదరణ పొందాయి. ఎంతోమంది తెలుగుతో పాటు సంస్కృతంలో పాండిత్యం ఉండి రచనలు చేసినవారు, మల్లినాథసూరి వంటి భాషా దిగ్గజాలు గౌరవం పొందారు. తన రచనలను ఆదరించిన ఒక ముస్లిం రాజుకి హిందూ కవి ‘మల్కిభ రాముడు’ అన్న బిరుదు ఇవ్వటం భాషా సంస్కారం ఉన్న తెలు గు నేలలోనే సాధ్యం!

దాదాపు ఒక శతాబ్ద కాలం ఒకరికి ఒకరు తెలిసి, అర్ధ శతాబ్దం కలిసి ఒక రాష్ట్రంగా ఉన్న ఆంధ్ర, తెలంగాణవారికి పదాల, జాతీయాల విషయంలో వివాదాలు రావటం చూస్తున్నాం. ఒకసారి శాసనసభలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విపక్ష నేత చంద్రబాబుని ‘తాట వలుస్తా’ అన్నాడు. ఆంధ్ర, రాయలసీమ నేతలకు ఆ మాట తప్పనిపించలేదు, అది ఆ ప్రాంతాల్లో సహజంగా వాడే భాష గనుక. అదే ఉద్యమ సమయంలో కేసీఆర్ ఎవరినీ ఉద్దేశించి కాకుండా జనాంతికంగా ‘నాలుక కోస్తారు’ అనగానే ఆంధ్ర నాయకులలో ప్రకంపనలు మొదలయ్యాయి.

> నిజానికి తెలంగాణలో చాలా సహజంగా వాడే పదం అది! నిష్పాక్షికంగా ఆలోచిస్తే నాలుక కోసినా మనిషి బతుకుతాడు, తాట (చర్మం) వలిస్తే బతుకుతాడా? తెలంగాణ జాతీయమే తక్కువ ప్రమాదకరం కదా! అయినా భాష అర్థం కానప్పుడు ఇలాగే సమస్యలు వస్తాయి. రెండూ వేరు భాషలు కదా!

తెలంగాణ ప్రాంతంవారు ఆడపిల్లని పుట్టింటికి ‘తోలుకొస్తాం’ అంటే ఆంధ్రావారు ఎక్కిరిస్తారు. ‘మేం పశువులని మాత్రమే తోలుకొస్తాం, పుట్టింటికి ఆడపిల్లని ‘తీసుకొస్తాం’’ అని వేళాకోళం చేస్తారు. అది వింటే తెలంగాణ వారికి నవ్వు వస్తుంది. ఎందుకంటే ఈ ప్రాంతంలో ఒక శవాన్ని మాత్రమే ‘తీసుకొస్తాం’ అని వ్యవహరిస్తారు, బతికి ఉన్నవాళ్లని కాదు! దీనికి చక్కటి ఉదాహరణ ‘ముత్యాల ముగ్గు’ సినిమాలో ఉంది. ‘సార్ రాయుడు వచ్చాడు’ అని సెక్రెటరీ చెప్పగానే, విలన్ రావుగోపాలరావు అడుగుతాడు. ‘వచ్చాడా, తీసుకొచ్చావా?’ అని. అంటే బతికి ఉన్నాడా, లేడా? అని అర్థం అన్నమాట! అంటే ఒక్క పదం కూడా రెండు ప్రాంతాల వారి మధ్య చిచ్చుపెట్టగలిగినంత వేరు భాషలు తెలుగు, ఆంధ్రం! తెలంగాణవారి మారుమూల పల్లెల్లో ఉన్న భూములు కూడా ఆంధ్ర పెట్టుబడిదారులు, రాజకీయ నాయకులు కబ్జా చేయగలరేమో కానీ, శ్రీకాకుళం నుంచో, కడప నుంచో వెళ్లినవారికి తెలంగాణవారి స్వచ్ఛమైన తెలుగు భాష అర్థం చేసుకోవటం మాత్రం సాధ్యం కాదు. ఒకే అక్షరాలున్న ఇంగ్లిషు, ఫ్రెంచ్, జర్మన్ లాగే ఆంధ్రం, తెలుగు వర్ణమాల ఒకటే కలిగి ఉంటాయి. కానీ, పూర్తి వేరు భాషలు. ‘వచ్చింది’ అన్నది స్త్రీ లింగానికి వాడినప్పుడు ‘వచ్చిండు’ అన్నదే సరైనది కదా, ‘వచ్చాడు’ ఎక్కడినుంచి వచ్చిండు?’ అని అడిగాడు ఒక తెలంగాణ భాషావేత్త ఒకసారి.

తెలుగు అన్న పదాన్ని మొట్టమొదటగా శంకరంబాడి సుందరాచారి అన్న కవి తన పాటలో లాలిత్యం కోసం తస్కరించి ‘మా తెలుగు తల్లికి మల్లెపూదండ’ సృష్టించాడు. అప్పుడు తెలుగువాళ్లంతా నిజాం ప్రభుత్వంలో (1942) వేరే దేశంగా ఉండటంతో వారికి ఈ భాషా కబ్జా సంగతి తెలియదు. 1956 తర్వాత ఆ మల్లెపూదండ నిజమైన తెలుగువారి మెడలో ఉరితాడై బిగిసింది. 1969 ఉద్యమం తర్వాత ఆంధ్ర రాజకీయ నాయకులకు తెలంగాణ విడిపోతుందనే భయం పట్టుకుంది. అందుకే ఎన్టీ రామారావు తన పార్టీకి ‘తెలుగు దేశం’ అని పేరు పెట్టుకున్నాడు తెలివిగా! నిజానికి ప్రస్తుతం ఆ పార్టీ తెలుగుదేశం కాదు, ఆంధ్రదేశం కాదు, చంద్రదేశం! ఎందుకంటే 9 ఏండ్లు రాష్ట్రం విడిపోయాక ఇంకో ఐదేండ్లు ముఖ్యమంత్రిత్వం వెలగబెట్టిన చంద్రబాబు నాయుడు ఆంధ్రకు, తెలంగాణకు ఎవరికీ ఏమీ మంచి చెయ్యలేదు. తొమ్మిదేండ్లలో హైదరాబాద్‌ను నిర్మించా నని డప్పు కొట్టుకునే ఆయన ఆంధ్ర ప్రాంతంలో అటువంటి ఇంకొక్క నగరాన్ని 14 ఏండ్లలో కూడా నిర్మించలేకపోయాడు.

ఈ భాషా వైవిధ్యాన్ని గౌరవించలేని ఆంధ్ర వారు వైరుధ్యాలు మాత్రం సృష్టించగలిగారు. భావ సమైక్యత సాధించలేనివారు ఇతర ప్రాంతాల్లో ఉండటానికి తగరు. రేపు అమెరికా ఎన్నికల్లో కమలా హ్యారిస్ గెలిస్తే, కాలిఫోర్నియా రాష్ట్రాన్ని ఆంధ్ర రాష్ట్రంగా ప్రకటించాలని అక్కడి ఆంధ్ర ఉద్యోగులు ధర్నాలు, నిరసనలు చేసినా ఆశ్చర్యం లేదు, చంద్రబాబును జైల్లో పెట్టినప్పుడు హైదరాబాద్‌లో అల్లర్లు సృష్టించినట్టు. తమవి కాని వేరే ప్రాంతాలకు వలసవెళ్లినవారు వినయంగా ఉండాలి కానీ, విజయులమని భ్రమపడకూడదు. ■

కనకదుర్గ దంటు
89772 43484

ఆవిష్కరణ

‖ ప్రకటనలు ‖

2024, సెప్టెంబర్ 29వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కుడికాల వంశీధర్ రాసిన ‘లోపలి వాన’ కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరుగనున్నది. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్.గోపి, విశిష్ట అతిథిగా డాక్టర్ ఎస్.రఘు హాజరుకానుండగా, ఆచార్య సూర్యా ధనుంజయ్ అధ్యక్షత వహించనున్నారు. డాక్టర్ గిన్నారపు ఆది నారాయణ, తదితరులు పాల్గొంటారు. అందరూ ఆహ్వానితులే.

- మద్దాళి రఘురాం

వార్షిక సాహిత్య సభలు

2024 అక్టోబర్ 6న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి సమావేశ మందిరంలో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వార్షిక సాహిత్య సభలు జరగనున్నాయి. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రారంభ సమావేశం, మధ్యాహ్నం 2-3.30 గంటల వరకు సాహిత్య సదస్సు, మధ్యాహ్నం 3.30-4.30 గంటల వరకు పుస్తకావిష్కరణలు, సాయంత్రం 4.30-5.30 వరకు కవి సమ్మేళనం జరగనున్నాయి.